క్లుప్తంగా

లాయక్ అహ్మద్‌కు గోల్డ్‌మెడల్

హన్మకొండ కల్చరల్: హనుమకొండకు చెందిన కళాకారుడు ఎండీ డాక్టర్ లాయక్ అహ్మద్.. కర్నాటక సంగీతంలో గోల్డ్ మెడల్ సాధించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం జరిగిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ 16వ స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా, గోల్డ్ మెడల్ అందుకున్నారు. అలాగే, వరంగల్ జిల్లా సంగెం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన సముద్రాల సుదర్శనాచార్యులు తెలుగు విశ్వవిద్యాలయంలో జ్యోతిష్య విభాగంలో ఎంఏ పూర్తిచేసి గవర్నర్ తమిళిసై నుంచి పట్టా అందుకున్నారు.

పంచాయతీ కార్యదర్శి వర్సెస్ మాజీ సర్పంచ్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సీతానాగారం గ్రామపంచాయతీ, మాజీ సర్పంచ్ మధ్య విబేధాలు భగ్గుమన్నాయి. వారి గొడవ కాస్త పోలీస్‌స్టేషన్‌కు చేరింది. వివరాల్లోకి వెళ్లితే.. ఇటీవల సీతానాగారం సర్పంచ్‌గా పదవీకాలం పూర్తి చేసుకున్న ఐలయ్య మంగళవారం మద్యం తాగి వచ్చి కుర్చీతో కొట్టడానికి యత్నించడమే కాకుండా పరుష పదజాలాన్ని వినియోగించారని పంచాయతీ కార్యదర్శి స్వప్న పేర్కొన్నారు. గతంలోనూ పలుమార్లు ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడారని స్వప్న ఫిర్యాదులో వివరించారు. కాగా, పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో పంచాయతీ కార్యదర్శి స్వప్న ఎక్కువ పర్సెంటేజీ డిమాండ్ చేశారని మాజీ సర్పంచ్ ఐలయ్య పేర్కొన్నారు. ఈ విషయమై ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నిబంధనలు సడలించాలి

హన్మకొండ: గ్యాస్ సిలిండర్ రాయితీ అమలులో నిబంధనలను సడలించాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు కోరారు. మహిళల పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉండాలనే నిబంధనతో లక్షలాది మంది ఈ పథకానికి దూరమవుతారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ రీఫిల్ ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. నిబంధనలతో పేదలకు లబ్ధిచేకూరదని తెలిపారు. మహిళలకే వర్తింపజేస్తామనే నిబంధనను ఎత్తివేయాలని సూచించారు. గ్యాస్ కనెక్షన్ ఎవరి పేరుపై ఉన్నా ఆహార భద్రత (తెల్లరేషన్) కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.500లకే గ్యాస్ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

'ఆస్పత్రి'ని ఏర్పాటు చేయాలి

కాజీపేట: కాజీపేట పట్టణంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ.అంకూస్ కోరారు. ఈమేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్ క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి ఘనంగా సన్మానించారు.

ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

విద్యారణ్యపురి: మాధవ స్మారక సమితి ఆధ్వర్యంలో హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పౌచులను బుధవారం బహూకరించారు. అలాగే, గతేడాది పదో తరగతి పరీక్షల్లో జిల్లాలో ప్రథమ స్థాయిలో నిలిచిన బి.వైశాలి అనే విద్యార్థినికి రూ.5,001 నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం జగన్, స్టాఫ్ సెక్రటరీ వెంకటేశం, మాధవ స్మారక సమితి ప్రతినిధులు డాక్టర్ సుధాకర్ రావు, ఆలువాల భిక్షపతి, దాస్యం రామానుజం, శ్రీనివాస్‌రెడ్డి, పెద్దిరెడ్డి మల్లారెడ్డి, జలందర్‌రెడ్డి, రాచకట్ల లక్ష్మణ్, సుధాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో మహా అన్నదానం

కాజీపేట: కాజీపేట పట్టణంలో 420 మంది ప్రయాణికులతో పాటు యాచకులకు గౌరి గోశాల నిర్వాహకులు బుధవారం మహా అన్నదానం నిర్వహించారు. గోశాల వ్యవస్థాపకుడు పాశికంటి వీరేశం ఆధ్వర్యంలో దాతల చేయూతతో అన్నదానం చేశారు. మంచాల కవిత, నాగరాజు, బొల్లికొండ కోటేశ్వర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


అఖిల్ (ఫైల్)

మడికొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మడికొండ శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ ఎల్లమ్మ దేవాలయం వద్ద క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో కాజీపేట పట్టణం విష్ణుపురికి చెందిన బొల్లెపోజు అఖిల్ (23) క్రికెట్ ఆడడానికి బుధవారం మడికొండకు వచ్చాడు. తిరిగి విష్ణుపురికి ద్విచక్ర వాహనంపై కాజీపేట వైపు వెళ్తుండగా మడికొండ నుంచి ధర్మసాగర్ వైపు వెళ్తున్న టిప్పర్ అతన్ని ఢీ కొట్టింది. దాంతో అఖిల్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఏఎస్సై చంద్రమౌళి తెలిపారు. బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తున్న యువకుడిని టిప్పర్ రూపంలో మృత్యువు కబలించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

హనుమకొండలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (పెట్రోల్‌పంపు)లో జాతీయ సైన్స్ దినోత్సవంలో ఉపాధ్యాయులు



హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీచైతన్య స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిట్లను ప్రారంభిస్తున్న ఎంఈఓ రామకిషన్‌రాజు



కాజీపేట ప్రశాంత్‌నగర్ తేజస్వి పాఠశాలలో ఎగ్జిబిట్లను తిలకిస్తున్న స్కూల్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు



ఘనంగా సైన్స్ దినోత్సవం

సీవీ.రామన్ 132వ జయంతి, జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పాఠశాలలు, కళాశాలల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సైన్స్ అన్నింటికి మూలం అని వివరించారు.

\- సాక్షి నెట్‌వర్క్


బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ పాఠశాలలో..


కాశిబుగ్గలోని శ్రీచైతన్య పాఠశాలలో..


నయీంనగర్: కిషన్‌పుర మాస్టర్‌జీ స్కూల్‌లో..


కరీమాబాద్: కీవీ పాఠశాలలో..


కాశిబుగ్గ స్టాండర్డ్ హైస్కూల్‌లో..


ఖిలా వరంగల్: బహుమతులు ప్రదానం చేస్తూ..


నయీంనగర్: ఏకశిల హైస్కూల్‌లో..


హసన్‌పర్తి: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో..


కాజీపేట బాపూజీనగర్‌లోని ఆపిల్ పబ్లిక్ స్కూల్‌లో..


గిర్మాజీపేట పాఠశాలలో..


కడిపికొండ గ్రామంలోని శ్రీచైతన్య పాఠశాలలో..

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కాజీపేట రూరల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కాజీపేట దర్గా ప్రభుత్వ పాఠశాలలో పాఠశాల హెడ్‌మాస్టర్ ఎస్ఎంఎం స్వామి అధ్యక్షతన 'మత్తు పదార్థాలు – మరణ మృదంగం' అనే అంశంపై బుధవారం జరిగిన సదస్సులో డాక్టర్ చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, కవి, కళాకారుడు రాజమోహన్, ఉజ్వల సాహితీ సంస్థ నిర్వాహకుడు సాంబయ్య, రామదాసు, సమ్మయ్య, డాక్టర్ ఆనంద్, ఎస్.రవిప్రసాద్, ఉపాధ్యాయులు సంతోష్‌కుమారి, సుమలత, సతీష్‌పాల్, సునీత, కె.శ్రీనివాస్, మహేష్, వరలక్ష్మి, సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సలహాదారు వేం నరేందర్‌కు అభినందనలు

కాజీపేట: ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కాజీపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హనుమకొండ ప్రభుత్వ అతిథి గృహంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కార్యక్రమంలో సుంచు వేణు, తిప్పారపు సురేందర్, పాలడుగుల ఉపేందర్, తిప్పారపు మహేష్, బొల్లికొండ రవితేజ గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో సహ విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులు.. తమ అనుభవాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు అరుణకుమారి, ఉదయ్‌కుమార్, రాణి, మాలతిదేవి, శ్రీవర్ధన్‌రెడ్డి, పుష్ప, భాను, సిబ్బంది, స్థానికుడు దోమ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిత్య సాహిత్య అధ్యయన శీలి అయిలయ్య


మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: నిత్య సాహిత్య అధ్యయన శీలి ఆచార్య బన్న అయిలయ్య అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. బన్న అయిలయ్య ఈనెల 29న ఉద్యోగ విరమణ సందర్భంగా, అలాగే షష్టిపూర్తి మహోత్సవాన్ని కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం సెమినార్ హాల్‌లో డాక్టర్ మంథిని శంకర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దళిత శ్రామిక నేపథ్యం నుంచి అనేక కష్టనష్టాలను ఎదుర్కొని ప్రొఫెసర్ స్థాయికి అయిలయ్య ఎదిగారని కొనియాడారు. తొలుత, బన్న అయిలయ్య షష్టిపూర్తి అభినందన సంచికను విజయపథం గ్రంథాన్ని విశిష్ట అతిథి వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి వీసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, డాక్టర్ సీతారాం, రచయిత, కవి వీఆర్. విద్యార్థి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సమ్మేళనంలో పాల్గొనండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శేషు, తదితరులు

హన్మకొండ కల్చరల్: సనాతన ధర్మ విశిష్టతను చాటి చెప్పడానికి, మహాశివరాత్రి జాగరణ కోసం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనంలో ఓరుగల్లు ప్రజలు పాల్గొనాలని ఆగమ సామ్రాట్ భద్రకాళి శేషు పిలుపునిచ్చారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిఏటా ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు. మార్చి 8న శివరాత్రిని పురస్కరించుకుని హనుమకొండ హయగ్రీవచారి మైదానంలో సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈమేరకు హనుమకొండలోని హరిత హోటల్‌లో ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో భద్రకాళి శేషు, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి పాల్గొని సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహక కోఆర్డినేటర్లు కత్తుల అభిషేక్, దీపక్, కార్పొరేటర్ రవినాయక్, వేలేరు ఎంపీటీసీ రాజు, సుకాంత్, నరేందర్ పాల్గొన్నారు.

నల్లచట్టాలు రద్దు చేయకుంటే పోరాటమే


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు నల్ల చట్టాలను రద్దు చేయకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు హెచ్చరించారు. ఈమేరకు హైదరాబాద్ నిజాం కళాశాల నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు రైతు సంఘీభావ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో రైతులు భారీగా తరలివెళ్లారు. కోమటిపల్లి హైవే వద్ద రైతులకు ఎమ్మెల్యే నాగరాజు సంఘీభావ ప్రకటిస్తూ ర్యాలీని ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, పొన్నాల రఘు, మధుసూదన్, సంగాల ప్రేమ్‌కుమార్, దేవస్థాన మాజీ చైర్మన్ జన్ను రవి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం..


ఆర్థిక సాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

హన్మకొండ చౌరస్తా: నిరుపేద ఆర్యవైశ్య కుటుంబాలకు అండగా ఉంటామని ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వెలగందుల రాజు భరోసా ఇచ్చారు. హనుమకొండకు చెందిన 75ఏళ్ల దొడ్డ శశిరేఖ సొంతింటి నిర్మాణం కోసం సమితి జాతీయ అధ్యక్షుడు గందె ప్రేమ్‌గాంధీ, రాష్ట్ర అధ్యక్షుడు బొద్దుకూరి కిరణ్‌కుమార్ రూ.25 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హనుమకొండలోని సమితి జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆ మొత్తాన్ని వృద్ధురాలు శశిరేఖకు అందజేశారు. అనంతరం ప్రేమ్‌గాంధీ, కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వృద్ధురాలి ఇంటి నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. 2022, జనవరి నుంచి ప్రతినెలా పేద ఆర్యవైశ్యులకు 13 వస్తువులతో కూడిన నిత్యావసర వస్తువులను అందజేస్తున్నట్లు వివరించారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన



వరంగల్ క్రైం: పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ఇంటర్ పరీక్ష కేంద్రాలను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రతిష్ఠాపనోత్సవం

హన్మకొండ కల్చరల్: హనుమకొండ కాకాజీకాలనీలోని పార్వతీ సహిత జలేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా బుధవారం ప్రతేక పూజలు నిర్వహించారు. జలేశ్వరాలయం నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మట్ట శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కొండకండ్ల యోగలింగేశ్వరస్వామి దేవాలయ అర్చకులు పాలకుర్తి సుధాకర్ గౌతం శర్మ, వెన్నంపల్లి జగన్‌మోహన్ శర్మ గణపతి హోమం, దేవతాహోమం, అధివాస హోమం, ధాన్యదివాసం నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులకు భక్తులు 10బస్తాల బియ్యం సమర్పించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు అభినందనలు

కాజీపేట: కాజీపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వై.సుధాకర్ రెడ్డిని పట్టణ బ్రాహ్మణ అర్చక సంఘం సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శ్వేతార్కుడి చిత్రపటాన్ని అందించి ఆశీర్వచనం అందజేశారు. అర్చక సంఘం ఉపాధ్యక్షుడు అయినవోలు ప్రవీణ్ కుమార్ శర్మ, మోత్కూరి రాము, జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ, అయినవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, ఉడుతల శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

డీటీసీని కలిసిన లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



వరంగల్: వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్ ఆధ్వర్యంలో వరంగల్ డీటీసీ గంధం లక్ష్మి, ఎంవీఐలు స్వర్ణలత, శ్రీనివాస్‌ను కమిటీ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లాల్ అహ్మద్, జాయింట్ సెక్రటరీ సలీం, అహ్మద్‌ఖాన్, సలహాదారు నర్సింహరావు, లారీల ఓనర్లు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సరోజన

నయీంనగర్: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షురాలు బైరబోయిన సరోజన యాదవ్ విజ్ఞప్తి చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బడ్జెట్ విడుదలైనా తమకు బిల్లులు మాత్రం రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన కోడిగుడ్ల ధరను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పోలెపాక లక్ష్మి, రజియా, శారద, శోభ, దేవి పాల్గొన్నారు.

వైభవంగా రౌషన్ షహీద్ దర్గా ఉర్సు


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్‌బాబా, మత పెద్దలు

ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్ సమీపంలోని చారిత్రకమైన ఘంజ్ షోహద్ రహిమతుల్లా హలే రౌషన్ షహీద్ గంధం, ఉర్సు ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. దర్గా అధ్యక్షుడు సయ్యద్ షా ఆరిఫొద్దీన్ హుస్సైనీ సాబేరి ఆధ్వర్యంలో రహిమతుల్లా హలే రౌషన్ షహీద్ గంధం, ఉర్సు ఉత్సవాలను కనులపండువగా నిర్వహించారు. శంభునిపేట పురవీధుల్లో నృత్యాలు, ఫకీర్ల విన్యాసాలతో సందల్ గంధం ఊరేగింపును నిర్వహించారు. మతపెద్దలు నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి పూలు, గంధాన్ని దర్గాకు సమర్పించారు. పూలు, పట్టు వస్త్రాలను కప్పి అలంకరించారు. పలు రాష్ట్రాల దర్గాల పీఠాధిపతులు, ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్‌బాబా, హైదరాబాద్ మత పెద్ద మహ్మద్ నాజీం రథా, సయ్యద్ ముజాహిద్ ఖాద్రీ, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎండీ.ఫసీ, రఫిక్ హైమద్ సాబ్రీ, రహిమాన్ సాబ్రీ, ఖాజాపాషా, ఖదీర్‌పాషా, సయ్యద్‌రబ్బానీ పాషా, నవాజ్, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పార్ట్‌టైం అధ్యాపకుల ధర్నా


మాట్లాడుతున్న ప్రొఫెసర్ అమరవేణి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో అధ్యాపకులు చేపట్టిన నిరసన కొనసాగుతోంది. కేయూలోని పరిపాలన భవనం వద్ద బుధవారం బైఠాయించి ధర్నా నిర్వహించారు. వివిధ విభాగాలల్లో, వర్సిటీ కళాశాలల్లో 16 పీరియడ్ల వర్క్‌లోడును కలిగిఉండి అర్హత కలిగిన పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మిగితా పార్ట్‌టైం అధ్యాపకులకు పీరియడ్‌కు రూ.700ల నుంచి రూ.వేయికి రెమ్యూనరేషన్‌ను పెంచాలని సూచించారు. ధర్నా కార్యక్రమంలో కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు, బాధ్యులు నరేందర్‌నాయక్, దేవోజీనాయక్, భాగ్యమ్మ, మాధవి, బక్కి శ్రీనివాస్, పరహాఫాతిమా, సమత, ప్రగతి, జోత్స్న, సరిత, రవీందర్‌రెడ్డి, నవీన్, సంజీవ్, సందానందం తదితరులు పాల్గొన్నారు. కాగా, ధర్నాకు కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అమరవేణి సంఘీభావం తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

కరీమాబాద్: వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం పదకొండు మండలాలు, వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపాలిటీల పరిధిలో నీటి సరఫరాపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా జరిగేలా చూడాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ఏఈలు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి తాగునీటి సరఫరాలో తలెత్తే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని చెప్పారు. నీరు వృథా కాకుండా గ్రామాల్లో ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వారం రోజుల లోగా కార్యాచరణ ప్రణాళికలపై నివేదికలు ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లాలోని మండలాలు, హబిటేషన్స్‌లో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని చెప్పారు. ఎంపీడీఓలు గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహించి జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. వేసవిలో గ్రామాల్లో ఓహెచ్ఎస్ ట్యాంకులను శుభ్రం చేసి వ్యాధుల వ్యాప్తి లేకుండా చూడాలన్నారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీపీఓ కల్పన, ఎస్ఈ రాములు, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గీసుకొండ : వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద వివిధ క్యాడర్లలో 32 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయినట్లు వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ తెలిపారు. మార్చి 4లోపు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు హెచ్‌టీటీపీ://వరంగల్.తెలంగాణ.జీఓవీ.ఇన్ అఫీషియల్ వెబ్‌సైట్‌లో చూడాలని డీఎంహెచ్ఓ సూచించారు.

సంకల్పయాత్రను విజయవంతం చేయాలి

కాజీపేట: పట్టణంలో మార్చి 1న జరగనున్న విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని పార్టీ నేత రావు అమరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. రహమత్‌నగర్ కాలనీలో డివిజన్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జ్ రాంమనోహర్, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగ్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు భగవాన్‌దాస్ ఉపాధ్యాయ, మేకల శ్రావణ్, విజయ్, కురుమయ్య, హరి, వ్యాస్ పాల్గొన్నారు.